# కలం

kalamdaily.com

Follow on: Kalamtelugu

ప్రజల గళం...

సోమవారం • 06.04.2026 | పేజీలు: 4


360° SINGLE TOPIC

డిజిటల్ కిల్లింగ్స్

## సోషల్ మీడియా అడ్డాగా

# డెత్ ట్రాప్స్!

ఫేక్ ఫొటోలతో ఫ్రెండ్ రిక్వెస్టులు.. ఆత్మీయంగా పలకరింపులు..

**లైక్ కొట్టి కనెక్ట్ అయితే ఇక అంతే..!**

ప్రేమ పేరుతో మోసాలు, మర్డర్లు

**పెరిగిపోతున్న 'డిజిటల్ కిల్లింగ్స్'**

అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వినయ్, జ్యోతి ఫ్రెండ్స్ అయ్యారు.. ప్రేమలో పడ్డారు.. పెళ్లి చేసుకున్నారు. ఏ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఆ ఇద్దరినీ ఒక్కటి చేసిందో.. అదే వారి మధ్య చిచ్చు పెట్టింది. జ్యోతి సోషల్ మీడియా అకౌంట్స్‌ను వినయ్ చూడటంతో గొడవ మొదలై.. చివరికి ఆమెను అతడు హత్య చేసే వరకు వెళ్లింది. జ్యోతిని చంపిన తర్వాత వినయ్ సూసైడ్ అటెంప్ట్ చేశాడు. ఇది హైదరాబాద్ చైతన్యపురిలో జరిగిన ఘటన.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఇషికకు ఫేస్‌బుక్‌లో నీరజ్ పరిచయమయ్యాడు. పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నాడు. ఇషికది బిహార్.. నీరజ్‌ది మధ్యప్రదేశ్. ఇద్దరూ హైదరాబాద్‌లో జాబ్ చేస్తూ మియాపూర్‌లో కాపురం పెట్టారు. ఇషికకు నీరజ్ నుంచి వరకట్న వేధింపులు మొదలయ్యాయి. వేధింపులు తాళలేక ఉరేసుకొని చనిపోయింది.

డిగ్రీ చదువుతున్న కీర్తి రెడ్డికి సోషల్ మీడియాలో శశికుమార్‌తో స్నేహం ఏర్పడి, అది ప్రేమగా మారింది. ఊరూపేరు తెలియని వ్యక్తితో ప్రేమ ఎందుకని తల్లి మందలించడంతో.. ఆమెను అడ్డు తొలగించుకోవాలని శశితో కలిసి చంపేసింది. ఇది కూడా హైదాబాద్‌లో జరిగిన ఘటనే!!


......ఇలా ఒకటా రెండా? సోషల్ మీడియా పరిచయాలు, ప్రేమలు, పెళ్లిళ్లు.. అయితే ప్రాణాలు పోగొట్టుకోవడం, లేదా తోడు వచ్చినవాళ్లను చంపడం, వ్యతిరేకించారని కన్నవాళ్లనే కడతేర్చడం వరకు వెళ్తున్నాయి. పచ్చని కుటుంబాలను రోడ్డున పడేస్తున్నాయి. ముక్కూమొఖం తెలియని వ్యక్తులతో జరిగే సోషల్ మీడియా స్నేహాలు డెత్ ట్రాప్‌కు దారితీస్తున్నాయి.

- సెంట్రల్ డెస్క్, కలం

అరచేతిలోని స్మార్ట్‌ఫోన్.. హాయ్ అంటూ గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లు.. ఒక్కసారి ఓకే చెప్పి టచ్‌లోకి వెళ్లామంటే ఇల్లు, ఒళ్లు, లైఫ్ మటాష్!! సోషల్ మీడియా వేదికగా చెప్పే తియ్యటి మాటలు నమ్మి, కుటుంబ నేపథ్యం తెలియకుండానే చేసుకునే పెళ్లిళ్లు.. కొద్ది రోజులకే అనుమానం, విభేదాల కారణంగా ఒకరి ప్రాణాలు ఒకరు తీసుకునే స్థాయికి చేరుతున్నాయి. 'నువ్వే నా ప్రపంచం' అని సోషల్ మీడియాలో చెప్పకుని ఊహల్లో తేలినవాళ్లే.. పెండ్లి తర్వాత 'హంతకులు'గా మారుతున్న ఘటనలు కోకొల్లలు. సోషల్ మీడియాలో పరిచయమైన వ్యక్తి కోసం, పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులనే శత్రువులుగా చూస్తున్న విపరీత ధోరణి పెరిగిపోతున్నది. హైదరాబాద్ సీపీ సజ్జనార్ వంటి వారు నిత్యం సోషల్ మీడియా వేదికగానే ఎంతో అవేర్‌నెస్ కల్పిస్తున్నారు. డిజిటల్ 'డెత్ ట్రాప్' ఉచ్చులో చిక్కుకుంటున్న బాధితుల్లో 70 శాతం మంది 30 ఏళ్లలోపు వారే. వీటిపై **కలం 360 డిగ్రీస్** స్పెషల్ స్టోరీ...



## బాధితుల్లో 30 ఏళ్లలోపు వారే 70%



నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) నివేదికల ప్రకారం.. దేశంలో జరుగుతున్న సైబర్ రిలేటెడ్ క్రైమ్స్‌లో 15 శాతం ప్రేమ, పెండ్లి పేరుతో జరుగుతున్న మోసాలే. తెలంగాణలో నమోదవుతున్న మహిళలపై వేధింపుల కేసుల్లో 30% పైగా సోషల్ మీడియా పరిచయాల వల్ల జరుగుతున్నవే. బాధితుల్లో 18 నుంచి 30 ఏళ్ల వయస్సు వారు 70% మంది ఉండటం గమనార్హం.




## ఫేక్ ప్రొఫైల్స్ అండ్ ఐడెంటిటీ క్రైసిస్

చాలామంది సోషల్ మీడియాలో అసలు వ్యక్తిత్వాన్ని దాచిపెట్టి, అవతలి వారికి నచ్చేలా నటిస్తారు. పెళ్లయిన తర్వాత అసలు రంగు బయటపడటంతో ఇద్దరి మధ్య ఘర్షణలు మొదలై అది హత్యల వరకు దారితీస్తున్నది.

## డిజిటల్ అనుమానం




భార్యాభర్తలు ఇద్దరూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండటం వల్ల.. అవతలి వ్యక్తి ఎవరితో చాట్ చేస్తున్నారు? ఎవరి ఫొటోలు లైక్ చేస్తున్నారు? అనే చిన్న చిన్న విషయాలు పెద్ద గొడవలకు, అనుమానం పెరగడానికి కారణమవుతున్నాయి.



## మతపరమైన కోణం

కొన్ని సందర్భాల్లో సోషల్ మీడియాలో తప్పుడు పేర్లతో పరిచయం చేసుకుని.. పెండ్లి చేసుకున్నాక మతం మారాలని ఒత్తిడి చేయడం. నిరాకరిస్తే హత్య చేయడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

## ఇన్‌స్టంట్ గ్రాటిఫికేషన్



సోషల్ మీడియాలో ఆడ మగ పరిచయాలు.. చాలా వేగంగా ప్రేమగా మారుతాయి. ఒకరి గురించి ఒకరు పూర్తిగా తెలుసుకోకుండానే పెండ్లి నిర్ణయం తీసుకుంటున్నారు. వాస్తవ పరిస్థితులు ఎదురైనప్పుడు తట్టుకోలేక హింసకు దిగుతున్నారు. మర్డర్లకు పూనుకుంటున్నారు.


## అప్రమత్తంగా ఉండటం ఎలా?




**బ్యాక్‌గ్రౌండ్ వెరిఫికేషన్:** ఎవరైనా ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపినప్పుడు వారి ప్రొఫైల్ పిక్చర్ మాత్రమే చూడకండి. ఆ అకౌంట్ ఎప్పుడు క్రియేట్ చేశారు? మ్యూచువల్ ఫ్రెండ్స్ ఉన్నారా? వారు పెట్టే పోస్టులు ఎలా ఉన్నాయి? అనేది గమనించాలి.



**వ్యక్తిగత సమాచారం వద్దు:** పరిచయం అయిన వెంటనే మీ ఫోన్ నంబర్, ఇంటి అడ్రస్, మీరు ఎక్కడ పని చేస్తారు? మీ కుటుంబ సభ్యుల వివరాలు, ఫొటోలను పంచుకోవద్దు.



**ప్రైవేట్ ఫొటోలు/వీడియోలు:** వీడియో కాల్స్‌లో అసభ్యంగా ప్రవర్తించడం లేదా ప్రైవేట్ ఫొటోలు పంపడం చేయొద్దు. ఇవే భవిష్యత్తులో బ్లాక్ మెయిలింగ్‌కు ఆయుధాలు అవుతాయి.



**తొందరపాటు ప్రేమలు:** రెండు రోజులు చాట్ చేయగానే 'ప్రేమ' అనుకోవడం భ్రమ. అవతలి వ్యక్తి ఏదో మభ్య పెట్టాలని చూస్తున్నారని గుర్తుంచుకోండి.




**ఒంటరిగా కలవొద్దు:** మొదటిసారి కలవాల్సి వస్తే కచ్చితంగా పబ్లిక్ ప్లేస్ (షాపింగ్ మాల్ లేదా రెస్టారెంట్) ఎంచుకోండి. మీ స్నేహితులకు లేదా నమ్మకమైన వారికి మీరు ఎక్కడికి వెళ్తున్నారో చెప్పి వెళ్లండి.



**ఆర్థిక లావాదేవీలు:** సోషల్ మీడియా స్నేహితులు డబ్బు అడిగితే వెంటనే అనుమానించండి. కష్టాల్లో ఉన్నానని చెప్పి ఆన్‌లైన్ ద్వారా డబ్బులు వసూలు చేయడం ఒక పెద్ద స్కామ్.



**కుటుంబానికి చెప్పండి:** ఏదైనా పరిచయం సీరియస్ అవుతోందని అనిపిస్తే, కచ్చితంగా మీ ఇంట్లో పెద్దలకు లేదా నమ్మకమైన స్నేహితులకు చెప్పాలి. రహస్యాలు దాచడం నేరగాళ్లకు బలాన్నిస్తుంది.



**స్క్రీన్ షాట్స్ భద్రం:** ఎవరైనా మిమ్మల్ని వేధిస్తున్నా లేదా అనుమానాస్పదంగా ప్రవర్తిస్తున్నా ఆ చాటింగ్ స్క్రీన్ షాట్స్ తీసి పెట్టుకోవాలి. ఇవి పోలీసులకు ఫిర్యాదు చేసేటప్పుడు సాక్ష్యాలుగా పనిచేస్తాయి. కాల్స్ ను కూడా రికార్డ్ చేసుకొని పెట్టుకోవడం బెటర్.




**బ్లాక్ అండ్ రిపోర్ట్:** అవతలి వ్యక్తి ప్రవర్తన నచ్చకపోయినా, అసభ్యంగా మాట్లాడినా మొహమాటం లేకుండా వెంటనే బ్లాక్ చేయండి. ఆ ప్రొఫైల్‌పై సోషల్ మీడియా సంస్థకు రిపోర్ట్ చేయాలి.




**అవగాహన పెంచుకోండి:** సైబర్ క్రైమ్స్ ఎలా జరుగుతున్నాయి? హనీ ట్రాప్ అంటే ఏమిటి? వంటి విషయాల మీద అవగాహన కలిగి ఉండాలి.


## ఇన్‌స్టాగ్రామ్.. ప్రేమ పెండ్లి.. విషాదాంతం

ఏపీలోని శ్రీకాకుళం జిల్లా సింగుపురం గ్రామానికి చెందిన వివాహిత రమ(34), ఏలూరు జిల్లాకు చెందిన మావుళ్లయ్య (25)కు మధ్య ఇన్ స్టా గ్రామ్‌లో కొన్నాళ్ల కింద పరిచయమై ప్రేమగా మారింది. ఇరువురూ పారిపోయి రహస్యంగా పెళ్లి చేసుకుని వేరే గ్రామంలో కాపురం పెట్టారు. ఇది తెలిసిన రమ భర్త, బంధువులు నిలదీయడంతో మనస్తాపం చెందారు. గత బుధవారం ఏలూరులో కాల్వలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇద్దరి డెడ్ బాడీలు గురువారం లభించాయి. ఇన్‌స్టాగ్రామ్ పరిచయంతో మొదలైన ప్రేమ ఆత్మహత్యతో విషాదాంతమైంది. ఘటనతో రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఇద్దరు పిల్లలు తల్లికి దూరమయ్యారు.

## డేటింగ్ యాప్‌లో ఫ్రెండ్‌షిప్.. ఇంటికి పిలిచి మర్డర్

ఏపీలోని విజయనగరం జిల్లా రాజాంకు చెందిన నేవీ టెక్నీషియన్ చింతాడ రవీంద్ర (35)కు, వైజాగ్ కు చెందిన మౌనిక(29)కు లాక్ డౌన్ సమయంలో డేటింగ్ యాప్‌లో పరిచయమైంది. రవీంద్ర భార్య కొద్దిరోజుల కింద సొంతూరుకు వెళ్లింది. ఆదివారం మౌనికను అతడు తన ఇంటికి పిలిచాడు. అక్కడ ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఆ తర్వాత ఆమెను రవీంద్ర హత్య చేశాడు. అనంతరం మౌనిక బాడీని ముక్కలుగా కట్ చేసి ఫ్రిజ్‌లో పెట్టాడు. తల, ఆమె ఫోన్‌ను బయట కాల్చేశాడు. ఇంట్లో రక్తపు మరకలు కడిగి.. వాసన రాకుండా సెంటు కొట్టాడు. అనంతరం గాజువాక పోలీసులకు రవీంద్ర లొంగిపోయాడు. ఆమెకు రూ.3.50 లక్షలు ఇచ్చినట్లు, ఇంకా డబ్బులు కావాలని వేధిస్తుందని, ఆమె టార్చర్ భరించలేకే మౌనికను చంపేసినట్లు నిందితుడు రవీంద్ర పోలీసులకు చెప్పాడు.







నమ్మించి మోసం

### గాలం వేయడం:

నేరగాళ్లు లేదా సైకో ప్రవృత్తి ఉన్నవాళ్లు సోషల్ మీడియాను ఒక వేట స్థలంగా వాడుకుంటున్నారు. ఒక ఆకర్షణీయమైన ప్రొఫైల్ ఫొటో, విలాసవంతమైన జీవనశైలిని ప్రతిబింబించే పోస్ట్‌లతో పక్కాగా ప్లాన్ చేస్తారు. ఒంటరిగా ఉన్నవారు, ప్రేమ కోసం వెతికేవారు లేదా మానసిక ఇబ్బందుల్లో ఉన్నవారిని గుర్తించి ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపుతారు. ఫొటోలకు లైక్ కొట్టడం, చాలా బాగున్నారు అని కామెంట్ చేయడంతో పరిచయం మొదలవుతుంది.

### నమ్మకాన్ని నిర్మించడం:

ఒకసారి పరిచయం అయ్యాక, అవతలి వ్యక్తిని పూర్తిగా తన గుప్పిట్లోకి తెచ్చుకునే ప్రయత్నం చేస్తారు. పొద్దున్న లేచినప్పటి నుంచి పడుకునే వరకు చాటింగ్ చేస్తూ, తానే లోకం అన్నట్లు భ్రమింపజేస్తారు. 'నీకంటే నన్ను అర్థం చేసుకునే వారు ఎవరూ లేరు', 'నీకోసం ఏదైనా చేస్తా' వంటి మాటలతో భావోద్వేగంగా లొంగదీసుకుంటారు. తన గురించి అబద్ధపు రహస్యాలు చెప్పి, మీ నుంచి కూడా అన్ని విషయాలు తెలుసుకుంటారు.

### దూరం పెంచడం:

ప్రేమ ముదిరినట్లు నటించి, మెల్లగా బాధితుడిని/బాధితురాలిని వారి కుటుంబం నుంచి వేరు చేస్తారు. 'నీ ఇంట్లో వాళ్లు మన ప్రేమను అర్థం చేసుకోరు', 'వాళ్లు మనకు శత్రువులు' అని నూరిపోస్తారు. ఇంట్లో తెలియకుండా కలవడం, రహస్యంగా మాట్లాడటం అలవాటు చేస్తారు. దీనివల్ల రేపు ఏదైనా ప్రమాదం జరిగినా ఇంట్లో వారికి అనుమానం రాదు.

### తొందరపాటు నిర్ణయాలు:

ఒకరి గురించి ఒకరు పూర్తిగా తెలియకముందే భౌతిక సంబంధం లేదా పెళ్లి వైపు అడుగులు వేయిస్తారు. ఇంట్లో వాళ్లకు తెలియకుండా గుడిలోనో లేదా రిజిస్టర్ ఆఫీసులోనో పెళ్లి చేసుకుంటారు. పెళ్లి కాకముందే కలిసి ఉందాం అంటూ ఒకే ఇంట్లో చేరతారు. ఇక్కడే అసలు సమస్య మొదలవుతుంది.

### ముసుగు తొలగడం:

పెండ్లి తర్వాత లేదా కలిసి ఉండటం మొదలయ్యాక, అప్పటివరకు చూపించిన 'మంచి' ముసుగు తొలగిపోతుంది. ఆర్థిక ఇబ్బందులు, వ్యసనాలు, పాత సంబంధాలు బయటపడతాయి. భాగస్వామి ఫోన్ వాడకాన్ని నియంత్రించడం, పాస్‌వర్డ్‌లు అడగడం, పాత స్నేహితులతో మాట్లాడితే అనుమానించడం మొదలవుతుంది. అంతకుముందు పంచుకున్న ప్రైవేట్ ఫొటోలు, వీడియోలను చూపిస్తూ భయపెట్టడం జరుగుతుంది.

### గొడవలు:

అనుమానం పెనుభూతంగా మారుతుంది. ప్రతి చిన్న విషయానికి గొడవలు జరుగుతాయి. బయటకు వెళ్లనివ్వకపోవడం, బంధువులతో మాట్లాడనివ్వకపోవడం వల్ల బాధితులు ఒంటరైపోతారు. గొడవలు జరిగినప్పుడు పెళ్లికి ముందు ఉన్న ప్రేమ కాస్తా ద్వేషంగా మారుతుంది. 'నేను కాకపోతే ఇంకెవరికీ దక్కకూడదు' అనే సైకో ధోరణి పెరుగుతుంది.

### హత్య.. విషాదాంతం:

చివరి దశలో నేరం జరుగుతుంది. దీనికి ప్రధానంగా 3 కారణాలు ఉంటాయి. బాధితురాలు గొడవ చేస్తోందని లేదా పోలీసులకు చెప్తానని భయపెట్టినప్పుడు చంపేస్తారు. వేరే ఎవరితోనో సంబంధం ఉందనే అనుమానంతో ఆవేశంలో ప్రాణాలు తీస్తారు. ఆస్తి కోసం లేదా ఇన్సూరెన్స్ కోసం పెండ్లి చేసుకున్న వారు అయితే పక్కా ప్లాన్‌తో హత్య చేస్తారు.

## ఎందుకు ఈ దారుణాలు?

నిపుణుల విశ్లేషణ ప్రకారం.. ఆన్‌లైన్‌లో వ్యక్తులు తమ అసలు వ్యక్తిత్వాన్ని దాచిపెట్టి, అవతలి వారికి నచ్చేలా ఒక నకిలీ ప్రపంచాన్ని సృష్టిస్తారు. పెళ్లి తర్వాత వాస్తవ పరిస్థితులు ఎదురైనప్పుడు, ఆ అంచనాలు తలకిందులై ఘర్షణలు మొదలవుతున్నాయి. ఈ క్రమంలో తలెత్తే అనుమానాలు, ఈర్ష్య చివరకు హత్యల వరకు వెళ్తున్నాయి. ఈ వ్యవహారంలో తల్లిదండ్రుల పాత్ర కీలకం. పిల్లలు ఫోన్‌లలో ఎవరితో మాట్లాడుతున్నారు? వారి ప్రవర్తనలో ఏమైనా మార్పులు వచ్చాయా? అనేది తల్లిదండ్రులు గమనించాలి. వారితో స్నేహపూర్వకంగా ఉంటూ సోషల్ మీడియాలో దాగి ఉన్న ప్రమాదాల గురించి వివరించాలి.

## చట్టం మీ వెంటే ఉంది

**సోషల్ మీడియా ద్వారా వేధింపులు ఎదురైతే భయపడాల్సిన పనిలేదు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన షీ టీమ్స్ లేదా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు.**

**1930 లేదా 100కి కాల్ చేసి తక్షణ సహాయం పొందవచ్చు.**




- పెండ్లి తర్వాత అనుమానమే పెనుభూతమై... ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి వేదికల్లో అపరిచితుల మధ్య మొదలైన చిన్న పలకరింపులు.. ప్రేమగా మారి, పెళ్లి పీటల వరకు వెళ్తున్నాయి. అయితే, ఈ డిజిటల్ బంధాలు అంతే వేగంగా రక్తపాతంతో ముగుస్తున్నాయి. ప్రేమించి పెండ్లి చేసుకున్న జంటలు పచ్చగా సంసారం చేసుకోవాల్సింది పోయి, పెండ్లయిన కొద్దిరోజులకే అనుమానం పెనుభూతంగా మారి ఒకరి ప్రాణాలు ఒకరు తీసుకునే స్థాయికి చేరుతున్నారు.

- ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వినయ్, జ్యోతి పరిచయమయ్యారు. కొన్నాళ్ల పాటు చాటింగ్ చేసుకున్న తర్వాత ప్రేమలో పడ్డారు. ఇంట్లో పెద్దలను ఒప్పించి ఘనంగా పెండ్లి చేసుకున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కావడంతో వినయ్ ఆర్థికంగా బాగున్నాడని జ్యోతి నమ్మింది. పెండ్లయిన కొద్దిరోజులకే వినయ్ అనుమానపు రోగం బయటపడింది. జ్యోతి ఎవరితో మాట్లాడుతోంది? సోషల్ మీడియాలో ఎందుకు ఫొటోలు పెడ్తున్నావు? అంటూ వేధించడం మొదలుపెట్టాడు. 2024, డిసెంబర్ 7న జరిగిన గొడవలో.. ఆవేశానికి లోనైన వినయ్ తన భార్య జ్యోతిని దారుణంగా హత్య చేశాడు. ఆ తర్వాత తను కూడా ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన హైదరాబాద్ చైతన్యపురిలో దారుణ ఘటన చోటు చేసుకున్నది.

- ఫేస్‌బుక్ పరిచయం ప్రాణాలు తీసింది. రమేష్ తన మొదటి పెండ్లి విషయాన్ని దాచి లావణ్యను ప్రేమ పేరుతో లొంగదీసుకున్నాడు. ఆమె ఒత్తిడి చేయడంతో పెండ్లి చేసుకున్నాడు. తర్వాత రమేష్‌కు అప్పటికే పెండ్లయి పిల్లలు ఉన్నారనే నిజం లావణ్యకు తెలిసింది. దీనిపై ఆమె నిలదీయడంతో, 2024 ఆగస్టు 22న ఆమెను గొంతు నులిమి చంపేసి మృతదేహాన్ని ధర్మసాగర్ సమీపంలోని కుంటలో పడేశాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా హన్మకొండలో జరిగింది.

- ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన అమ్మాయి మాటలు నమ్మి 2026 జనవరి 14న హైదరాబాద్‌కు చెందిన వరుణ్ ఆమెను కలవడానికి వెళ్లాడు. అక్కడ ఒక ముఠా అతన్ని బంధించి డబ్బులు డిమాండ్ చేసింది. గొడవ పెరగడంతో వరుణ్‌ను చంపేసి, మృతదేహాన్ని షాద్‌నగర్ శివార్లలో తగులబెట్టారు. 2026 జనవరి 20న ఈ కేసు మిస్టరీ వీడింది.

- వైష్ణవి.. ఓ యూట్యూబర్. సోషల్ మీడియాలో ఆమె రీల్స్ చూసి కోరుట్లకు చెందిన హరిబాబు.. వైష్ణవిని ప్రేమించాడు. 2025, జూన్‌లో పెండ్లి చేసుకున్నారు. అయితే, వీరి పెండ్లి కుటుంబ సభ్యులకు ఇష్టం లేకపోవడంతో ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయారు. తర్వాత వైష్ణవి తల్లిదండ్రులు బిడ్డ పడుతున్న కష్టాన్ని చూడలేక తమ ఇంట్లోనే ఆశ్రయం ఇచ్చారు. 2026, మార్చి 17వ తేదీ రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. భర్త హరిబాబు తన 4 నెలల గర్భిణీ అని కూడా చూడకుండా వైష్ణవిని కత్తితో హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటన జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామంలో చోటు చేసుకున్నది.


- ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన మధుకర్ తనను పెండ్లి చేసుకోవాలని మానసను వేధించేవాడు. ఆమె నిరాకరించడంతో ఆమె ఇంటికే వెళ్లి అందరూ చూస్తుండగానే గొంతు కోసి హత్య చేశాడు. ఈ ఘటన వరంగల్ జిల్లాలో జరిగింది.

- సోషల్ మీడియాలో నిధిగుప్తా, సుఫియాన్‌కు పరిచయం ఏర్పడింది. తనను పెండ్లి చేసుకోవాలంటే మతం మారాలని నిధిని సుఫియాన్ వేధించాడు. ఎంతకీ ఆమె అంగీకరించకపోవడంతో 2022, నవంబర్ 15న వారి మధ్య గొడవ జరిగింది. అపార్ట్‌మెంట్ 4వ అంతస్తు నుంచి నిధిని కిందకు తోసేసి సుఫియాన్ హత్య చేశాడు. ఈ ఘటన లక్నోలోని దుబగ్గా ప్రాంతంలో జరిగింది.

- బంబుల్ డేటింగ్ యాప్ ద్వారా శ్రద్ధావాకర్, అఫ్తాబ్‌కు ముంబైలో పరిచయం ఏర్పడింది. కుటుంబ సభ్యులు వీరి ప్రేమను వ్యతిరేకించడంతో ఢిల్లీకి వచ్చి సహజీవనం ప్రారంభించారు. 2022, మే 18న పెండ్లి విషయంలో గొడవ జరగడంతో అఫ్తాబ్ ఆమెను చంపి మృతదేహాన్ని 35 ముక్కలుగా నరికి ఫ్రిజ్‌లో దాచాడు. రోజూ రాత్రి పూట ఒక్కో ముక్కను అడవిలో పడేశాడు.


- నిక్కీ యాదవ్, సాహిల్ గెహ్లాట్ సోషల్ మీడియాలో పరిచయం ఏర్పడింది. కొన్నేండ్లు సహజీవనం చేశారు. అయితే సాహిల్ వేరే అమ్మాయితో పెండ్లికి సిద్ధమయ్యాడు. 2023, ఫిబ్రవరి 10న నిక్కీ ఈ విషయమై గొడవ చేయడంతో సాహిల్ ఆమెను కారులోనే చంపేశాడు. మృతదేహాన్ని తన కుటుంబానికి చెందిన ధాబాలోని ఫ్రిజ్‌లో దాచిపెట్టి, అదే రోజు సాయంత్రం వేరే అమ్మాయితో పెండ్లి చేసుకున్నాడు.

# కన్నవాళ్లపై కర్కశం..



కంటికి రెప్పలా కాపాడి.. అడుగులు నేర్పి.. ప్రయోజకులను చేసిన కన్నవారే.. ఆ బిడ్డల కండ్లకు శత్రువులుగా కనిపిస్తున్నారు. ప్రేమ మోజులో కన్నవాళ్లనే కడతేరుస్తున్నారు. దీనికంతటికీ కారణం.. అరచేతిలో ఇమిడిపోయే స్మార్ట్‌ఫోన్.. అందులో అపరిచితులతో ఏర్పడే సోషల్ మీడియా పరిచయాలు. ఒకప్పుడు సోషల్ మీడియా కేవలం సమాచార మార్పిడికి వేదిక అనుకుంటే.. నేడు అది పచ్చని సంసారాల్లో చిచ్చు పెట్టడమే కాకుండా.. కన్నవారిని కడతేర్చే మృత్యుపాశంలా మారుతోంది. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, ఫేస్‌బుక్ లైక్‌లు, డేటింగ్ యాప్ చాటింగ్‌ల మాయలో పడి.. కొన్నేండ్ల రక్తసంబంధాన్ని తెంచుకోవడమే కాకుండా, తమ ప్రేమకు అడ్డుపడుతున్నారన్న నెపంతో కన్నతల్లిదండ్రులను అత్యంత క్రూరంగా అంతం చేస్తున్న ఘటనలు సమాజాన్ని ఉలిక్కిపడేలా చేస్తున్నాయి.

ఏఐ ఫోటో



- డిగ్రీ చదువుతున్న కీర్తి రెడ్డికి సోషల్ మీడియా ద్వారా శశికుమార్ పరిచయమయ్యాడు. వీరి ప్రేమను తల్లి రజిత తీవ్రంగా వ్యతిరేకించింది. అడ్డు తొలగించుకోవాలని ప్లాన్ చేసిన కీర్తి, తన ప్రియుడితో కలిసి నిద్రిస్తున్న తల్లిని 2019, అక్టోబర్ 20న గొంతు నులిమి చంపేసింది. దారుణం ఏంటంటే.. శవాన్ని ఇంట్లోనే ఉంచి 3 రోజుల పాటు ప్రియుడితో కలిసి అక్కడే ఉంది. వాసన రాకుండా ఉండేందుకు ఫినాయిల్ వాడింది. చివరకు రైలు పట్టాల దగ్గర శవాన్ని పడేసి తప్పించుకోవాలని చూసి దొరికిపోయింది. హైదరాబాద్ హయత్‌నగర్‌లో దారుణ ఘటన చోటు చేసుకున్నది.

- సోషల్ మీడియాలో పరిచయమైన వంశీతో పెళ్లికి తండ్రి నిరాకరించాడని కూతురు కక్ష పెంచుకుంది. ప్రియుడితో కలిసి తండ్రిని చంపేందుకు ప్లాన్ చేసింది. ఇంట్లో పడుకున్న సమయంలో ఇద్దరు కలిసి దాడి చేసి చంపేశారు.ఈ ఘటన 2021, సెప్టెంబర్ 20న హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో చోటు చేసుకున్నది.

- శిరీష ఆన్‌లైన్‌లో పరిచయమైన యువకుడితో పారిపోవాలని ప్లాన్ చేసింది. తల్లి అడ్డు చెప్పడంతో, ప్రియుడి సలహాతో తల్లిని చంపేసి.. ఆమె ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని నమ్మించే ప్రయత్నం చేసింది. పోలీసుల విచారణలో అసలు విషయం బయటపడింది. ఈ ఘటన 2022, మార్చి 24న ఖమ్మం జిల్లాలో చోటు చేసుకున్నది.

- సోషల్‌మీడియాలో పరిచయమైన ప్రియుడిపై మోజుతో.. కన్నతల్లినే దారుణంగా చంపేసిందో 15 ఏండ్ల బాలిక. తన ప్రేమకు తల్లి అడ్డుగా ఉందని భావించి.. ప్రియుడు, అతడి తమ్ముడితో కలిసి ఆమె మెడకు చున్నీతో ఉరి బిగించింది. అప్పటికీ.. చనిపోయిందో లేదోనన్న అనుమానంతో తలపై సుత్తెతో కొట్టి దారుణంగా హత్య చేసింది. ఈ ఘటన హైదరాబాద్‌లోని జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌పరిధిలో 2025, జూన్ 23న చోటు చేసుకున్నది.

- కిరణ్మయి నర్సుగా పనిచేస్తూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండేది. ఈ క్రమంలో ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక యువకుడితో పరిచయం ఏర్పడి, అది ప్రేమగా మారింది. వీరి ప్రేమ విషయం ఇంట్లో తెలియడంతో తల్లిదండ్రులు మందలించారు. తన ప్రేమకు అడ్డుపడుతున్నారని కక్ష పెంచుకున్న కిరణ్మయి, ప్రియుడితో కలిసి తల్లిదండ్రులను అడ్డు తొలగించుకోవాలకున్నది. నర్సు కావడంతో మెడికల్ నాలెడ్జ్‌ను నేరానికి వాడుకుంది. పడుకున్న తల్లిదండ్రులకు మత్తు మందు ఇచ్చి, ఆ తర్వాత అత్యంత దారుణంగా వారిని చంపేసింది. చివరికి పోలీసుల విచారణలో విషయం బయటపడింది. ఈ ఘటన 2024, ఆగస్టులో చోటు చేసుకున్నది.

- మౌనికకు ఆన్‌లైన్ ద్వారా రవి పరిచయమయ్యాడు. వీరిద్దరూ కలిసి తిరగడాన్ని తల్లి తప్పుబట్టింది. దీంతో మౌనిక తన ప్రియుడిని ఇంటికి పిలిపించి, తల్లి నిద్రిస్తున్న సమయంలో ఆమె ముఖంపై దిండు పెట్టి అదిమి చంపేసింది. ఆ తర్వాత దొంగలు వచ్చి చంపినట్లుగా చిత్రీకరించే ప్రయత్నం చేసింది. చివరికి పోలీసుల విచారణలో దొరికిపోయింది. ఈ ఘటన 2022, ఏప్రిల్ 14న కడప జిల్లాలో చోటు చేసుకున్నది.

## సైబర్ నేరగాళ్లు మోసగిస్తే ధైర్యంగా చెప్పండి



"స్మార్ట్‌ఫోన్.. ఆడపిల్లల పాలిట శాపంగా మారుతున్నది. సోషల్ మీడియాలో పరిచయాలు ప్రమాదాల్లోకి నెట్టేస్తున్నాయి. అందమైన యువకులు లేదా సినీ నటుల ఫొటోలను డీపీలుగా పెట్టుకుని ఫేక్ అకౌంట్లతో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో అమ్మాయిలకు ఫ్రెండ్ రిక్వెస్టులు పంపుతూ ఆకర్షిస్తున్నారు. కొందరు ఆడపిల్లలు గుడ్డిగా నమ్ముతూ పర్సనల్ ఫొటోలు, వీడియోలు వారికి పంపుతున్నారు. వాటిని అడ్డం పెట్టుకుని అమ్మాయిలను కేటుగాళ్లు వేధిస్తున్నారు. ఈ విషయం ఇంట్లో చెప్పలేక కొందరు అమ్మాయిలు మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. పెండ్లికి ముందు అమాయకంగా నటిస్తున్న కొందరు అబ్బాయిలు.. ఆ తర్వాత అసలు రూపం చూపిస్తున్నారు. చెప్తే వినకపోతే దారుణంగా హత్య చేస్తున్నారు. మరికొందరు తమ ప్రేమ, పెండ్లికి అడ్డుగా ఉన్నారని కన్న తల్లిదండ్రులనే హత్య చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు వస్తే వెంటనే యాక్సెప్ట్ చేయకండి. ఫోన్ నంబర్, పర్సనల్ ఇన్ఫర్మేషన్ అపరిచితులతో పంచుకోవద్దు. ప్రేమ, పెండ్లి అని ఇబ్బంది పెడ్తుంటే వెంటనే పేరెంట్స్‌కు చెప్పండి. లేదంటే 'షీ టీమ్' ఆఫీస్‌కు వెళ్లి జరిగిందంతా చెప్పండి. సోషల్ మీడియాలో అప్రమత్తంగా ఉండండి.

- వీసీ సజ్జనార్,
హైదరాబాద్ పోలీసు కమిషనర్

